క్లుప్తంగా

ఆరాధనోత్సవం

బొబ్బిలి రూరల్: మండలంలోని కలవరాయి గ్రామంలో కావ్యకంఠ గణపతి మహాముని 88 వ ఆరాధనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అరుణాచల రమణ గణపతి ఆశ్రమంలో ఉదయం సుప్రభాతసేవ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్థానిక కూచిపూడి కళాకారిణి పవిత్ర గణపతి చేసిన నృత్య ప్రదర్శన అలరించింది.

27న పీడీఎస్ బియ్యం వేలం

రాజాం సిటీ: సంతకవిటి, రాజాం మండలాల పరిధుల్లో ఇటీవల సీజ్ చేసిన 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 27వ తేదీన వేలం వేయనున్నట్లు సీఎస్‌డీటీ చిరంజీవిరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు బియ్యం నిల్వలు పరిశీలించుకోవాలని, ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు డిపాజిట్ చేసి, వేలంపాటలో పాల్గొనాలన్నారు.

నీటమునిగిన పంటల పరిశీలన


వన్నలిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం, వన్నలి గ్రామాల్లో నీటమునిగిన పంటలను ఏవో జి.మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండకుండా చూసుకుంటే పంట పాడవ్వదని రైతులకు ఆయన తెలిపారు. ఆయన వెంట వీఆర్‌వో భారతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్


వృద్ధుడికి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

వంగర: మండల కేంద్రంలో బీసీజీ వ్యాక్సినేషన్ గురువారం చేపట్టారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, 18 నుంచి 60 ఏళ్ల వయసు వారికి ఈ వ్యాక్సిన్లు వేశారు. క్షయ వ్యాధి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఈ టీకాలు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం లెప్రసీ సర్వే చేసి, వ్యాధిగ్రస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం బి.విశాలాక్షి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన


నిరసన ర్యాలీలో విద్యార్థుల నినాదాలు

రాజాం: రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా స్థానిక పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్ నేతలు, విద్యార్థులు గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన రోడ్డులో నడిచి వెళ్తూ అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి కూటమి సర్కారు వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పుతుంటే ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని మహిళలు, చిన్నారులపై లైంగికదాడులు, మరికొందరిపై భౌతికదాడులు, హత్యలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

సంతకవిటి: ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని మందరాడ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో జి.పైడితల్లి గురువారం సందర్శించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు.

దోమల నివారణకు చర్యలు


దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న సిబ్బంది

తెర్లాం: మండలంలోని వి.చిన్నయ్యపేటలో దోమల నివారణకు గురువారం చర్యలు చేపట్టారు. ఎంపీడీవో బి.మధుసూదనరావు, ఈవోపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్ చప్ప రాము ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రామారావు పర్యవేక్షణలో అన్ని వీధుల్లో, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందును స్ప్రే చేశారు. కాలువల్లో, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించండి

- గ్రామ సందర్శనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

వంగర:

ప్రజాసమస్యలు, వాటి పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆయన అక్కడి అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, అక్కడి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యమైన విద్యనందించడంతో పాటు, రుచి, శుచి కలిగిన భోజనం అందివ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామస్తులు సమర్పించిన పలు వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.సందీప్, తహసీల్దార్ చిరంజీవి పడాల్, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఎంఈవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆగూరు గ్రామంలో మండల నోడల్ ఆఫీసర్ సుమబాల గురువారం పర్యటించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రజలకు సకాలంలో సేవలందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.కె. రాజు, ఐసీడీఎస్ పీవో కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.


వంగర: ఓనెఅగ్రహారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న జేసీ కార్తీక్


రేగిడి: సోమరాజుపేట అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో మండల నోడల్ ఆఫీసర్ కల్యాణ చక్రవర్తి


తెర్లాం: హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల నోడల్ ఆఫీసర్ రామారావు

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామంలో నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ఎ.కల్యాణచక్రవర్తి, ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దారు రాములమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొని, గ్రామస్తుల సమస్యలపై ఆరాతీశారు. గ్రామానికి రోడ్డు వేయాలని, అంబకండి వరకు ఆర్టీసీ బస్సు నడపాలని, 21ఎల్ తోటపల్లి కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించాలని, ఉపాధి బకాయి వేతనాలు వెంటనే చెల్లించేలా చూడాలని పలువురు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన..

తెర్లాం: గ్రామాల్లోని ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు తెలిపారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగన్నపాడు గ్రామంలో ఎంపీడీవో బి.మధుసూదనరావుతో కలిసి పర్యటించిన ఆయన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లోని సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తాను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మండల అధికారులంతా సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య, ఉప తహసీల్దార్ జి.భాస్కరరావు, ఈవోపీఆర్‌డీ నీలిమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, పీహెచ్‌సీ సీహెచ్‌వో భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి అభినందన..


రామభద్రపురం: పాఠశాల సందర్శనలో మండల ప్రత్యేకాధికారి గోవిందరావు

రామభద్రపురం: మండలంలోని ఇట్లామామిడిపల్లిలో నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఎ.సులోచనరాణిలతో కలిసి మండల ప్రత్యేకాధికారి గోవిందరావు పాల్గొని, అక్కడి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, అక్కడి సమస్యలపై ఆరాతీశారు. అక్కడి ప్రధానోపాధ్యాయుడు తెంటు సత్యారావు తన సొంత రూ.50 వేల నిధులతో పిల్లల తాగునీటి కోసం ట్యాప్‌లు, పైపులైన్ పనులు, గోడలపై విజ్ఞానం పంచే చిత్రాలు వేయించారని సిబ్బంది చెప్పడంతో ఆయనను అభినందించారు. అనంతరం గ్రామంలో తిరుగాడి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరావు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ కె.మధుసూదన్‌రావు పాల్గొని, అక్కడి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.ఈశ్వరప్రసాద్, ఎంపీడీవో పి.రవికుమార్, తహసీల్దార్ త్రినాధరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.


రాజాం: ఆగూరులో గ్రామ సందర్శన సమావేశంలో పాల్గొన్న అధికారులు


బొబ్బిలి రూరల్: పాఠశాల సందర్శనలో అధికారులు

సంతకవిటి: మండలంలోని అప్పలఅగ్రహారం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది, గ్రామస్తులతో మండల నోడల్ ఆఫీసర్ బి.సుధాకర్ సమావేశమై, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఉప తహసీల్దార్ రంజిత్, వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్, ఎంఈవో-2 భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


సంతకవిటి: అధికారులతో సమీక్షిస్తున్న మండల నోడల్ ఆఫీసర్ సుధాకర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: మండలంలోని గోపాలపురం సబ్‌స్టేషన్, బొద్దాం ఫీడర్‌ల పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ వి.సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కంచరాం ఫీడర్‌కు సంబంధించి కంచరాం, ఒమ్మి, ఆగూరు, డీఆర్ ఎస్ వలస, దోసరి, గడిముడిదాం, అమరాం గ్రామాలతో పాటు బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలోని గార్రాజుచీపురుపల్లి, బొమ్మినాయుడువలస, ఎంజేవలస, గెడ్డవలస, విజయరాంపురం, గొల్లపేట, బూరాడపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వర కు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రాజాం పట్టణ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు, ఎల్ఐసీ బిల్డింగ్ వెనుక, తాణావీధి, సారధి, మల్లికార్జునకాలనీ ప్రాంతాలకు కూడా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఓజేసీ ఏ కుమార్ తెలిపారు. టౌన్-2 లైన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

రాజాం సిటీ: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో స్టాప్ డయేరియా కార్యక్రమ ర్యాలీ గురువారం నిర్వహించారు. తాగునీటి బోరుబావులు, నేలబావుల్లో క్లోరినేషన్ చేపట్టడంతో పాటు కాలువల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఇళ్ల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ కె.భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రాజాం సిటీ: ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు

రామభద్రపురం: ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాత్రి గంటల వ్యవధిలో మూడు సుఖ ప్రసవాలు సిబ్బంది చేయగా, గురువారం ఉదయం ఆ తల్లీబిడ్డలకు వైద్యపరీక్షలు చేసి, వారి ఆరోగ్యం పరీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాతాశిశు మరణాలు లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన వారికి ఆసరా పథకం కింద పారితోషికం కూడా లభిస్తుందన్నారు. గర్భం దాల్చిన మూడో నెల నుంచే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, హెల్త్ సూపర్‌వైజర్ నేతృత్వంలో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఐరన్ మాత్రలు వాడుతున్నా రక్తహీనత ఉన్నట్లయితే ఐరన్ ఇంజక్షన్లు కూడా ఇస్తున్నామన్నారు.


శిశువు ఆరోగ్యం పరీక్షిస్తున్న వైద్యాధికారి దిలీప్‌కుమార్

రోడ్లు, కాలువలు నిర్మించండి

బొబ్బిలి: రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై పట్టణంలోని గొల్లపల్లి వాసులంతా గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిని కలిసి తమ విజ్ఞప్తులు తెలిపారు. పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. తాత్కాలికంగా గ్రావెల్ రోడ్డు వేస్తామని మున్సిపల్ కమిషనర్ సమాధానమిచ్చారు. అనంతరం అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను పరిశీలించిన ఆమె.. పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్ తదితరులు పాల్గొన్నారు.


గొల్లపల్లిలో రోడ్డు సమస్యను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి


రేగిడి: కాలిబాటలు వేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ శ్రీనివాసరావు

వంగర: వరినాట్లు వేసే సమయంలో కాలిబాటలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వేగిరెడ్డి మధు రైతులకు సూచించారు. మండలంలోని తలగాం గ్రామంలో వరినాట్లు వేయడంపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతీ రెండుమీటర్లకు ఒక అడుగు వెడల్పు అయిన కాలిబాట ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఉబాలు వేసేముందు వరినారు పైభాగం తొలగించి, నాటుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో వరినాట్లు వేసే సమయంలో కాలిబాటలు వేసుకోవడం, దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు గురువారం అవగాహన కల్పించారు. కాలిబాటలు వేసుకోవడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా పెరుగుతుందని, తద్వారా మంచి దిగుబడి వస్తుందని తెలిపారు.

రైతుకు రూ.20 వేల సాయమెప్పుడు..?


లక్ష్మునాయుడు

బొబ్బిలి: అన్నదాత సుఖీభవ పథకం పేరిట రైతుకు ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఖరీఫ్ సీజన్ ఆరంభం కాగానే ప్రతీ రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామన్నా విషయం మర్చిపోయారా అని నిలదీశారు. పెరిగిన ధరల నేపథ్యంలో వ్యవసాయం కష్టతరమైపోయిందని, ప్రభుత్వం సాయం కోసం ఎంతోమంది రైతులు ఎదురుచూపులు చూస్తున్నారన్నారు.

సన్మానం


ధర్మారావునాయుడును సన్మానిస్తున్న సిబ్బంది

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం సబ్ పోస్టాఫీస్‌లో వంగర రిటైర్డ్ బీపీఎం బొత్స ధర్మారావునాయుడును గురువారం ఘనంగా సన్మానించారు. ఎస్‌పీఎం ముదిల హరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.

ఆక్రమించుకుంటున్నా.. పట్టించుకోరా..?

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో ఉన్న 20 ఎకరాల చెరువు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుడు మజ్జి హరనాధరావు ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఆయన గురువారం వెళ్లి, చెరువు ఆక్రమణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తహసీల్దార్ ఎస్.కె.రాజును ప్రశ్నించారు. సరిగ్గా ఏడాది క్రితం గ్రీవెన్స్‌లో ఇదే విషయంపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

రేగిడి: మండలంలోని దేవుదళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 బి.ఎరకయ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి రికార్డులు పరిశీలించడంతో పాటు తరగతుల వారీగా వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. మెనూ ప్రకారం రుచి, శుచి కలిగిన భోజనం విద్యార్థులకు వండిపెట్టాలని తెలిపారు.

పుస్తకాల పంపిణీ

తెర్లాం: మండల కేంద్రంలోని స్టూడెంట్ కిట్ల నిల్వ కేంద్రం వద్ద మండలంలోని కేజీబీవీ (కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం), ఆదర్శ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాలను ఎంఈవో జె.త్రినాధరావు ఆయా కళాశాలల సిబ్బందికి గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయడం పూర్తి చేశామని, ప్రస్తుతం మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల విద్యార్థులకు పుస్తకాలు అందివ్వడం జరుగుతోందన్నారు. ఇక్కడి నుంచి తీసుకువెళ్లిన పుస్తకాలను విద్యార్థులకు పక్కాగా అందివ్వాలని తెలిపారు.


జూనియర్ కళాశాలల సిబ్బందికి పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో త్రినాధరావు

సకాలంలో స్త్రీనిధి లక్ష్యాలు పూర్తి చేయాలి

రాజాం: సకాలంలో స్త్రీనిధి లక్ష్యాలు పూర్తి చేయాలని ఏజీఎం ఉమామహేశ్వరరావు ఏపీఎంలకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, సీఎఫ్‌లతో గురువారం సమావేశమైన ఆయన.. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సంఘాల సంఖ్యను పెంపు, బ్యాంకు లింకేజీల సాయం సద్వినియోగంపై ప్రతినెలా సమావేశం నిర్వహిస్తుండాలన్నారు. కార్యక్రమంలో వెలుగు జేడీఎం డి.మార్టిన్, రాజాం ఏసీ ఎ.చిరంజీవి, బ్యాంకు లింకేజీ డీపీఎం రాజ్‌కుమార్, డీపీఎం బి.రవికుమార్, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏజీఎం ఉమామహేశ్వరరావు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

రాజాం/తెర్లాం: మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కోలాటం, నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. విద్యతో పాటు విద్యేతర రంగాల్లో కూడా విద్యార్థులు బాగా రాణించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. రాజాం మండలంలోని ఆగూరులో జరిగిన కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ సుమబాల, ఎంఈవో దుర్గారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు పాల్గొనగా, తెర్లాం మండలంలోని వెలగవలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో త్రినాధరావు, ప్రధానోపాధ్యాయుడు ధనుంజయరాజు తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం: వెలగవలసలో ఆకట్టుకున్న విద్యార్థినుల కోలాటం

మెనూ ప్రకారం వంటకాలు చేయాలి

బొబ్బిలి: మెనూ ప్రకారం వంటకాలు చేసి, విద్యార్థులకు పెట్టాలని ఎంఈవో గొట్టాపు వాసు సూచించారు. స్థానిక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాన్ని గురువారం పరిశీలించిన ఆయన..విద్యార్థుల వసతిగృహం, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి తెలిపారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో వాసు

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా రాస్తారోకో

రామభద్రపురం: కేంద్రం విడుదల చేసిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా జాతీయ రహదారిపై సీపీఎం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ప్రపంచ బ్యాంకు దగ్గర నుంచి అప్పు చేసేందుకు మాత్రమే అనుమతి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులు, రైతులకు కూడా బడ్జెట్‌లో అన్యాయం చేశారని విమర్శించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు ఖండించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి, రైల్వే జోన్ ఏర్పాటుకు, అమరావతి నిర్మాణానికి తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గారావు, చినరాజు, నాగరాజు, వెంకటరావు, సోములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా నేత ఎం.శంకరరావు విమర్శించారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలోని జూట్‌మిల్లు వద్ద సీపీఎం రాస్తారోకో చేపట్టగా, ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రంగాలకు ఈ బడ్జెట్‌లో అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి ఇస్తానన్న రూ.15 వేల కోట్లు కూడా గ్రాంట్ కాదని, అప్పు అని అన్నారు. కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మణికుమార్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు, తదితరులు